# చివరి మజిలీ

బ్రిటిష్ ఎయిర్‌వేస్‌లో, ఖతార్ ఎయిర్‌లైన్స్‌లో కూడా ప్రయత్నం చేశాను. సీట్లన్నీ ముందే బుక్ అయ్యాయి.

అనుకోని ప్రయాణం. చివరికి ఎయిర్ ఇండియాలో సీటు దొరికింది. ముంబై వరకు ఇంటర్నేషనల్ ఫ్లయిట్..... అక్కడి నుంచి హైదరాబాద్‌కి డొమెస్టిక్ ఫ్లయిట్‌లో వెళ్ళాలి.... ఒక ఫ్లయిట్ డిలే అయితే కనెక్టింగ్ ఫ్లయిట్ దొరికి చావదు. అదే ఇబ్బంది ఎయిర్ ఇండియాతో..... ఫ్లయిట్‌లో సౌకర్యాలూ అంతంత మాత్రమే. అయినా తప్పదు.... ఇరవై గంటల ప్రయాణం.

నేవార్క్ ఎయిర్‌పోర్ట్‌కు రమ్య వొచ్చింది. పిల్లల్ని స్కూలు దగ్గర పికప్ చేసుకుని చెకిన్ పాయింట్‌వరకూ వొచ్చింది.

"డాడీ... వై ఆర్ యు గోయింగ్ టు ఇండియా? వెన్ విల్ యు కమ్ బాక్?" అడిగాడు పెద్దాడు రవి.

"గ్రాండ్ ఫాదర్ ఈజ్ వెరీ సీరియస్.... అయామ్ గోయింగ్ టు సీ హిమ్....ఐ విల్ కమ్‌బాక్ సూన్" రవి బుగ్గలు నిమిరాను.

"మామయ్యగారికి తగ్గితే అమెరికా తీసుకువొచ్చేయండి" అంది రమ్య.

.....నాన్నకు పాస్‌పోర్ట్, వీసా రెండూ ఉన్నాయి. ఒకసారి అమెరికా వచ్చి రెండు నెలలు ఉండి వెళ్లాడు కూడా. తను ఒక్కడే కొడుకు.... కాని ఇండియాలో మంచి ఉద్యోగం దొరకదు. నాన్న ఇక్కడ చలికి తట్టుకోలేడు తను, రమ్య ఆఫీసుకు, పిల్లలు స్కూలుకు వెళ్ళిపోతారు..... ఇంట్లో ఆయన ఒక్కడే ఉండాలి.... అందుకే ఆరు నెలలు ఉంచామని అమెరికాకు వొచ్చి రెండు నెలలు తిరక్కముందే వెళ్ళిపోయాడు.

నాన్నది సెకండరీ గ్రేడు టీచరు ఉద్యోగం.... మరో ఆరునెలలు గడిస్తే ఆయన పదవీ విరమణ చేస్తాడు.... బాబాయ్ నుంచి ఫోను వొచ్చేదాకా నాన్న కులాసాగానే ఉన్నాడని అనుకుంటుండేవాడు. "మీ నాన్నకి ఒంట్లో బాగా లేకపోతే గుంటూరు పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్ళాం.... పరీక్షలు చేశారు.... కాన్సరని తేల్చేశారు.... ఎక్కువ రోజులు బ్రతికేటట్లు లేదు. వెంటనే వచ్చి చూసివెళ్ళు" అదీ బాబాయ్ ఫోన్లో చెప్పింది.

బోర్డింగ్ పాస్‌లు తీసుకున్నాడు. నేవార్క్ నుంచి ముంబైవరకు ఓ పాస్, ముంబై నుంచి హైదరాబాద్‌వరకూ మరో బోర్డింగ్ పాస్.... చెకిన్ లగేజ్ స్లిప్ కూడా తీసుకున్నాడు.

"గివ్ ఎ హగ్ టు యువర్ ఫాదర్" అంది రమ్య పిల్లలతో.

వాళ్లు వొచ్చి వాటేసుకున్నారు.... పెద్దాడు తన పోలికే! చిన్నాడు మాత్రం అచ్చు గుద్దినట్లు తాత లాగే ఉంటాడు.... నాన్న రూపం మళ్ళీ కళ్ళల్లో మెదిలింది.

"మా ఫరమ్‌వాళ్లు సెలవు ఇవ్వలేదు.... ఇచ్చినట్లయితే నేనూ మీతోపాటే పిల్లల్ని తీసుకుని వొచ్చేదాన్ని...." మరోసారి సంజాయిషీ ఇస్తున్నట్టుగా అంది రమ్య.

రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయాను.

"అసలే రిసెషన్.... ఆర్థికమాంద్యం భూతంలా అమెరికాను, అతలాకుతలం చేస్తూ ఉంది... ఇద్దరం ఇండియా వెళ్లిపోయి తిరిగి వచ్చేసరికి ఇద్దరి ఉద్యోగాలు ఊడిపోతే కష్టం. అందుకే సెలవు కోసం ఒత్తిడి చేయకుండా నేను ఇక్కడే ఉండి పోతున్నాను.... మామయ్యగారిని చూడాలని నాక్కూడా అన్పిస్తూ ఉంది.... తిరిగి వొచ్చేటప్పుడు పొలం, ఇల్లు అమ్మేసి రండి" అంది రమ్య.

చివరి మాటలు ములుకుల్లా తగిలేయి.

నాన్న చనిపోతాడని తనకూ తెలుసు.... "మీ నాన్న ఎటూ చనిపోతాడు... పొలం, ఇల్లూ అమ్మేసి వొచ్చేయండి. అక్కడ వాటిని చూసేవాళ్ళు ఎవరున్నారు?" అనే భావంతోనే రమ్య అంది.

ఆ మాటలు అనకుండా ఉండాల్సింది.

రమ్యతో ఏం మాట్లాడాలనిపించలేదు. ఆమె భుజం తట్టి సెక్యూరిటీ పాయింట్ దగ్గరకు వెళ్ళాను. క్యారీ ఆన్ బ్యాగ్ స్కానింగ్ కోసం ఇచ్చేసి బూట్లు, జేబులోని పర్సు మరో ట్రేలో పెట్టేశాను.... అన్నీ స్కానింగ్ అయ్యి అవతల పక్కకు వొచ్చేశాయి. పాస్‌పోర్ట్

చెక్‌చేసి తిరిగి ఇచ్చేశారు. బ్యాగ్ తీసుకుని, బూట్లు వేసుకుని, బోర్డింగ్ పాస్‌లో ఉన్న టెర్మినల్ పాయింట్ చూసుకుని అక్కడ ఉన్న లాంజిచ్‌లో కూర్చున్నాను. మరో గంట గడిస్తే గాని ఫ్లయిట్ టైం అవదు. గేటు నెంబరు చెక్ చేసుకుని కుర్చీలో కూర్చున్నాను.

గతంలోకి జారుకుంది మనస్సు.

నాన్న ఎంత నిరాడంబరంగా, శుభ్రంగా ఉండేవాడు.... ఎప్పుడూ ఉతికిన బట్టల్నే వేసుకునేవాడు. ఇస్త్రీ చేయించడం ఇష్టం ఉండేది కాదు.... చొక్కా గుండీ ఊడిపోతే తనే కుట్టుకునేవాడు. తెల్లటి చొక్కా, ధోవతి, భుజంపైన ఉత్తరీయం.... అరడుగుల మనిషి... నడుస్తుంటే భూమి దదదదలాడుతున్నట్లు ఉండేది. ఎప్పుడూ ముక్కు చీది ఎరగడు.

ఆయనకు కాన్సర్ ఏమిటి?

....సరిగ్గా డయాగ్నస్ చేశారో లేదో... సెకండ్ ఒపీనియన్ తీసుకున్నారో లేదో.... అయినవాళ్ళకు ఇలాంటి అనుమానాలే వొస్తాయేమో!

తెల్లని పావురంలా పరిశుభ్రంగా ఉండేవాడు ఎప్పుడూ. చలికాలం అయినా, జోరున వర్షాలు కురుస్తున్నా రెండు పూటలా స్నానం చేయాల్సిందే! నేను మాసిన చొక్కా వేసుకుంటే ఊరుకునేవాడు కాదు. సబ్బు పెద్దగా వాడేవాడు కాదు. అయినా ఆయన పక్కన నిలబడితే చెమట వాసన వొచ్చేది కాదు.

స్కూల్లో కూడా పాఠాల కంటే ముందు పరిశుభ్రత గూర్చి పదే పదే చెప్పేవాడు. 'క్లీన్లీనెస్ ఈజ్ నెక్స్ట్ టు గాడ్' అనేవాడు పిల్లలతో. స్టూడెంట్స్ ఉతికినబట్టలు వేసుకుని వరుసలో కూర్చుంటే వెలుగుతున్న ప్రమిదల్లా కన్పించేవాళ్ళు ఆయన కళ్ళకి. పాఠం అప్ప చెప్పకపోయినా, చదవకపోయినా అంతగా పట్టించుకునేవాడు కాదు. కాని స్నానం చెయ్యకుండా ఎవరన్నా అపరిశుభ్రంగా స్కూలుకు వొస్తే మాత్రం ఊరుకునేవాడు కాదు. తనకు బాగా గుర్తు. పెళ్ళి చూపులకు శరభయ్యగారింటికి వెళ్ళాం. ఊళ్ళో మోతుకురి రైతు...ఒక్కతే కూతురు.... అమ్మాయి కూడా బాగానే ఉంది.... అమ్మకి ఆ సంబంధం నచ్చి ఖాయం చేసుకుందామంది..... నాన్న ఒప్పుకోలేదు. శరభయ్య చుట్ట తాగుతూ ఇంటి ముందు ఉమ్మి వేయడం నాన్నకి నచ్చలేదు.

అమ్మంటే నాన్నకి పంచప్రాణాలు.... అయినా ఆమె చనిపోయేక నాన్న మాసిన బట్టలువేసుకుని, గడ్డం పెంచుకుని తిరగలేదు... తన పద్ధతుల్లో మార్పులేదు....ఉతికిన

బట్టల్లో మొగలిరేకులా వొంగిపోకుండా ఠీవిగా నడుస్తుండేవాడు.

ఫ్లయిట్ బయల్దేరే ముందు ఇంటికి ఫోన్‌చేశాను వొస్తున్నట్టు నాన్నకు చెప్పాను. "అలాగే ఉందిరా... బాగా నీరసంగా ఉంది" అన్నాడు నాన్న. అప్పుడే నిద్రలేచి స్నానంచేసి కాఫీ తాగుతున్నాడట.

ఓపిక లేనప్పుడు కూడా తెల్లవారుఝామున స్నానం ఎందుకో? నాన్న పద్ధతి అంతే!

ఇక్కడ న్యూజెర్సీలో చీకటిపడబోతూఉంది. అక్కడ ఇండియాలో తెల్లవారుతూ ఉంది.

❖ ❖ ❖

"నాకేం ఫరవాలేదు. దిట్టంగా తిరుగుతున్నాను. మరో ఇరవయ్యేళ్ళవరకూ ఢోకా లేదు అని అనుకుంటున్న సమయంలోనే ఈ జబ్బు వొచ్చిపడిందిరా. రెండు మూడు నెలల కంటే ఎక్కువ బ్రతకను" అన్నాడు నాన్న నా చేయి పట్టుకుని.

"ఎవరన్నారు మీరు రెండు నెలలకంటే ఎక్కువ బ్రతకరని? డాక్టరుగారు అన్నారా? ఎంత పెద్ద జబ్బయినా నయంచేసే మందులు, శస్త్రచికిత్సలు వొచ్చాయిప్పుడు. ఏ రోగానికి భయపడాల్సిన పనిలేదు" అన్నాను నాన్నకి ధైర్యం చెప్పాలనే ప్రయత్నం చేస్తూ.

"మొదట్లో తలనొప్పి వచ్చేది... కంటిచూపు తగ్గింది. డాక్టరు టెస్టులు చేసి బ్రెయిన్‌లో ట్యూమరన్నాడు.... చావుకు భయపడటం లేదురా! నేను భయపడుతున్నది జబ్బులు తీసుకు వచ్చే అపరిశుభ్రత గూర్చి. కెమోథెరపీ మొదటి డోసు ఇచ్చారు.... వెంట్రుకలు రాలిపోతు న్నాయి.... శరీరం శుష్కించుకుపోతున్నది... కొన్నిరోజులు పోతే మంచానికి అతుక్కు పోవాలి.... వొంటినిండా సూదులు గుచ్చుతారు.... బెడ్‌పాన్ తెచ్చి పెడతారు... బట్టలు తీసేసి గ్లోవ్స్ తొడుక్కున్న చేతులతో వొళ్ళంతా తడుముతారు.... బట్టలు కూడా మందుల వాసన కొడతాయి... అదంతా గుర్తుకు వస్తుంటేనే మనస్సు బాధగా మూలుగుతుంది" అన్నాడు నాన్న.

నాన్న కళ్ళల్లో కన్నీటి చార.

నాన్నను ఆ విధంగా ఎప్పుడూ చూడలేదు. దుఃఖం పొర్లుకు వొచ్చింది.

నా పరిస్థితి చూసి ఆయన తమాయించుకున్నాడు.

❖ ❖ ❖

మొదట్లో నాన్న పనిచేస్తున్న స్కూలులోని స్టాఫ్ తరచుగా వొచ్చిపోతూ ఉండేవాళ్ళు.... నాన్న పరిస్థితి శారీరకంగా రోజురోజుకీ దిగజారడంతో రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. మనిషి పీక్కుపోయి చూడడానికే ఇబ్బందిగా మారాడు.

మంచానపడ్డాక కూడా మనిషిగా మన్నన, గుర్తింపు కోరుకుంటారు ఏ రోగి అయినా. చావుకు దగ్గర్లో ఉన్నాడనే భావన రానివ్వకుండా రోగి మామూలుగానే ఉన్నట్టు బంధువులు, మిత్రులు ప్రవర్తించాలి. అప్పుడే మానసికంగా స్వస్థత చేకూరేది. కోలు కుంటాననే విశ్వాసం రోగి హృదయంలో ప్రోదిపడితే కొండలనైనా పిండి గొట్టగలుగుతాననే ధైర్యం వొస్తుంది.

ప్రతి క్షణం ఆయన్ని పట్టించుకున్నాననే భావన కలిగించడానికి ఎక్కువసేపు నాన్న మంచం దగ్గరే కాలక్షేపం చేసేవాడిని. ప్రతి చిన్న విషయాన్ని ఆయనతో సంప్రదించేవాడిని. "నాన్నా మంచం కిటికీ దగ్గరగా జరపమంటారా? మెత్తటి దిండు కావాలా? నొప్పి తగ్గినట్లు ఉందా? మామిడికాయ ముక్కలు తినండి. ఈ సీజన్ పోతే మళ్ళీ మామిడికాయలు కన్పించవ్.... వచ్చే సంవత్సరం వేసవి దాకా రావు.... స్కూల్లో ప్రార్థన సమయంలో మీ గురించి కూడా ప్రార్థన చేస్తున్నారట మీరు తొందరగా కోలుకోవాలని... మంచి ఆహారం తీసుకుంటే తొందరగా కోలుకుంటారు.... స్కూల్లో మళ్ళీ జాయిన్ కావొచ్చు... వొచ్చే సెప్టెంబర్ ఒకటో తారీఖు మీ జన్మదినం.... కాబట్టి మీ పదవీ విరమణ తేదీ ఆగష్టు ముప్పై ఒకటే.... ఆ రోజు ఆదివారం. ఒక రోజుముందే మీకు స్కూలువాళ్లు సన్మానం చేస్తారట...." రోజు ఇలా ఏవేవో కబుర్లు చెప్పేవాడిని.

నాన్న సహోద్యోగుల్ని ఇంటికి పిలిపించి ఆ మాటలే మళ్లీ వాళ్ళ చేత చెప్పించాను. స్కూలు కబుర్లు వింటుంటే నాన్నకి ఆనందం....

అమెరికా నుంచి వొచ్చి రెండు నెలలు గడిచిపోయాయి.

రోజూ అక్కడ నుంచి ఫోన్లు.... నాన్న పరిస్థితి రోజురోజుకీ దిగజారుతున్నా, పదవీ విరమణ రోజుకు ముందే చనిపోతాడని తెలిసినా రమ్యకు, పిల్లలకు ఆయన పరిస్థితి మెరుగుపడుతూఉందని చెప్పేవాడిని... "అయితే వెంటనే తిరిగి వొచ్చెయ్యి" అనేవాళ్ళు.

బాబాయ్‌రోజూ మాటల్లో ఏదో ఒక సందర్భంలో పొలం, ఇల్లు సంగతి మాట్లాడుతూనే ఉన్నాడు.

"మీ నాన్న కష్టపడి కొనుక్కున్నాడురా ఆ రెండెకరాల పొలం. మీ పొలం మా పొలం పక్కనే... కలుపుకోవడానికి వీలుంటుంది. నువ్వెటూ ఇక్కడ ఉండవుగా. మీ ఇంటి స్థలం వాములదొడ్డిగా వాడుకుంటాం... ఊరికినే ఇవ్వొద్దులే! ఎంతో కొంత తీసుకుని పొలం, ఇల్లు నా పేరున రాసెయ్యి" అన్నాడు బాబాయ్.

ఇంతలో ఊళ్ళో ఎవరూ ఊహించని సంఘటనొకటి జరిగింది.

నాన్న విషయంలో డాక్టర్లే ఇంటి దగ్గర ఉంచి ట్రీట్‌మెంట్ కొనసాగించమన్నారు. చనిపోతాడనుకున్న నాన్న రోజులు దొర్లించుకుంటూ వొస్తున్నాడు. ఏ జబ్బూ లేకుండా నిక్షేపంలా ఉన్న ఆ ఊరి సర్పంచ్ సెరిబ్రల్ హెమరేజ్ వొచ్చి ప్రాణాలు కోల్పోయాడు. ఆయన చనిపోతాడని ఎవరూ అనుకోలేదు. వారంరోజుల క్రితమే ఆయనే ఇంటికి వచ్చి నాన్నను పరామర్శచేశాడు. "అంతా భగవంతుడి లీల.... ధైర్యంగా ముందుకు సాగిపోవడమే మనిషి చేయగల్గింది..." తన భుజం తడుతూ అన్నాడాయన.

సర్పంచ్‌గారి అమ్మాయి, అబ్బాయి అమెరికాలో ఉన్నారు. ఉరుకు పరుగులతో ఇండియా వొచ్చేశారు తండ్రి ఆఖరు చూపుకోసం. అప్పుడనిపించింది.... అమెరికాలో పచ్చని చెట్లలాగా గర్వంగా గాలిలో తలలు ఊపుతూ బ్రతుకుతున్నాం. కాని మా చెట్ల వేళ్లు ఇండియాలోనే ఉన్నాయని... ఆ 'రూట్స్' తెగిపోతున్నాయి.

సర్పంచ్‌గారి అంతిమయాత్ర ఘనంగా జరిగింది... ఎవరూ గుండెల్లో బాధను బయటకు కన్పించనివ్వలేదు. ట్రాక్టర్‌ని పూలరథంలా అమర్చి శవయాత్ర ప్రారంభించారు. మేళతాళాలతో బాణాసంచా కాలుస్తూ సందడి సందడిగా ఆయన శవాన్ని స్మశానానికి చేర్చారు. డెత్ ఈజ్ సెలబ్రేషన్ అన్నట్లుగా.....

మనిషి చనిపోయేక అవతలిగట్టుకు చేరుకోవాలంటే వైతరిణీ నదిని దాటి వెళ్ళాలి. ఆ అవతలిగట్టు స్వర్గం కావొచ్చు, నరకం కావొచ్చు. భయంకరమైన మొసళ్లు, పాములు, మండ్రగబ్బలతో రక్తమాంసాలతో చెడువాసనతో నిండి ఉంటుందంటారు. ఏ ఇబ్బందీ లేకుండా ప్రేతాత్మను ఆ నదిని దాటించదానికే ఈ కర్మకాండల తంతు అంటారు.

అవన్నీ ఏమోగాని స్మశానానికి వొచ్చేసరికి అది వైతరిణీ నదిలాగే కన్పించింది. స్మశానంకు రెండు వైపులా మురుగుకాలువలు... ఎక్కడ చూసినా పాతగుడ్డ పీలికలు... పగిలిపోయిన సీసాముక్కలు... ఖాళీ చీప్ లిక్కర్ బాటిల్స్, బీరుసీసాలు... పందులు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. రుద్రభూమికి అతుక్కుపోయిన పాలిథిన్ సంచులు...

అంతిమయాత్ర అక్కడకు చేరుకునేసరికి ఊరేగింపులోని జనంలో మూడొంతులు జారుకున్నారు. ఏ కొద్దిమందో స్మశానంలో అడుగుపెట్టారు.

ఆ క్షణంలో నాన్న గుర్తుకు వొచ్చాడు.

ఎప్పుడూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చిన నాన్నకు కూడా ఇక్కడే దహనక్రియలు చేయాలా?

అందంగా ఉండే వాతావరణంలో అంత్యక్రియలు నిర్వహిస్తే ఎంత బాగుంటుంది. స్మశానం చుట్టూ అందంగా ప్రహరీగోడ.... లోపల పూలమొక్కలు... విశ్రాంతిగా కూర్చోవడానికి సిమెంటు బెంచీలు.... ఎత్తయిన చెట్లు.... ఎక్కడ చూసినా చల్లని నీడ.

వెనుకటి రోజుల్లో దేవాలయాల నిర్వహణకు షావుకార్లు, భూస్వాములు పొలాలను దేవుడికి రాసిఇచ్చేవాళ్ళు. ఇప్పుడు స్మశానం పరిరక్షణకు దానాలు చేయడానికి ముందుకు రావాలి కాబోలు.

నా ఆలోచనల్లో స్పష్టత వొచ్చేసింది.

మరుసటిరోజే ఊళ్ళో ఉన్న నాన్న పొలం అమ్మేశాను. ఆ విషయం నాన్నకు చెబితే సంతోషంగా తలూపాడు. పొలం అమ్మగా వొచ్చిన సొమ్ముకు మరికొంత చేర్చి శ్మశానాన్ని అందంగా తీర్చిదిద్దేపని, దాని నిర్వహణ బాధ్యత పంచాయితీ అధికారులకు అప్పగించాను. నాన్న తదనంతరం ఇంటిస్థలం ఊళ్ళోని ప్రాథమిక పాఠశాలకు చెందేట్లు రిజిస్ట్రేషన్ చేయించాను. పిల్లలు ఆడుకోవడానికి మా ఇంటి స్థలం బాగా ఉపయోగపడుతుంది. దాదాపు రెండెకరాల స్థలం అది.

పిల్లలు ఆనందంతో ఆ ఆటస్థలంలో ఆడుకుంటూ ఎగిరిగంతులు వేస్తుంటే నాన్న మనస్సు ఉప్పొంగుతుంది. ఈ లోకంలో ఉన్నా, పైలోకంలో ఉన్నా....

❖ ❖ ❖

రాలిపోయిన ఎండుటాకును చూసి పెద్దగా బాధపడలేదు. ఆ మనోధైర్యాన్ని నాన్నే కలిగించాడు.

నాన్న పాటించే పరిశుభ్రతకు భంగం కలగకుండా చూడగలిగానన్న తృప్తితో తిరిగి అమెరికా వెళ్లిపోయాను.

- ఆంధ్రజ్యోతి దినపత్రిక- ఆదివారం అనుబంధం - **26-6-2009**